అతిథి అధ్యాపకుల పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌టౌన్, జనవరి 17: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జంతు శాస్త్రం, ఆంగ్లం బోధించేందుకు ఆయా సబ్జెక్టులకు సంబంధించి పీజీలో కనీసం 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఉత్తీర్ణతతో పాటు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగి అభ్యర్థులు ఈ నెల 21న తగిన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతన పెంపుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారికి ఆశలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య

ఆమనగల్లు, జనవరి 17: ఆశ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అన్నారు. ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం అందజేయాలని శుక్రవారం ఆశ కార్యకర్తలతో కలిసి పెంటయ్య ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో వైద్యాధికారి పరీక్షిత్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ వేతనాలు పెంచాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశామని, అయినా ప్రభుత్వం స్పందించటం లేదని ఆయన దుయ్యబట్టారు. వేతనాల పెంపు కోసం ఈ నెల 21 బొంగుళూరు గేట్ నుంచి మన్నేగూడ వరకు ఆశ కార్యకర్తలతో కలిసి 10కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఆశ కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల అధ్యక్షురాలు అనిత, ప్రధాన కార్యదర్శి చంద్రకళ, బేబీ పాల్గొన్నారు.

గ్రామ సభలు నిర్వహణ

ఆమనగల్లు, జనవరి 17: ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 21 నుంచి 22 వరకు 13 పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలు, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు జరిగే రోజుల్లో ప్రజలందరూ ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

తట్టిఅన్నారం ట్రంక్‌లైన్‌కు

నిధులు విడుదల

కేటాయింపునకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జయశ్రీ, చిత్రంలో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 17: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేటలోని ఓ కన్వెన్షన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించి, వార్డుకు రూ.50 లక్షల చొప్పున నిధులను అభివృద్ధి పనులకు కేటాయించారు. తట్టిఅన్నారం, శివారు 16 కాలనీల మురుగు వెళ్లేందుకు ట్రంక్‌లైను నిర్మించేందుకు రూ.10 కోట్లు, పెద్దఅంబర్‌పేట నుంచి పసుమాముల వరకు గతంలో మంజూరైన ట్రంక్ లైను నిర్మాణాన్ని రెండు కిలోమీటర్లు పొడిగించేందుకు రూ.6 కోట్లు, కొత్తగా మున్సిపాలిటీలో విలీనమైన నాలుగు గ్రామ పంచాయతీలకు ఒక్కో దానికి రూ.25 లక్షల చొప్పున కేటాయించేందుకు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, జనవరి 17: జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం మేరకు డీసీసీబీ బ్యాంకులు, సహకార సంఘాల సొసైటీలు, పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు పొందిన ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలకు చెందిన దీర్ఘకాలిక రుణ మొండి బకాయిదారులు ఏకకాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) ద్వారా పరిష్కారం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ గోపాల్ తెలిపారు. ఆమనగల్లు సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల గంప వెంకటేశ్ మాట్లాడుతూ ఏకకాల రుణ పరిష్కారానికి 31-3-2018 నాటికి రుణం తీసుకున్న రుణ గ్రహీతలు అర్హులని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని దీర్ఘకాలిక రుణ ఖాతాలు, పీఎంఈజీసీ రుణాలకు మాత్రమే వర్తిస్తుందని వారు తెలిపారు. ఈ గడువు వచ్చే నెల 15-2-2025 వరకు ఉంటుందని రుణ గ్రహీతలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆమనగల్లు డీసీసీబీ పరిధిలోని 4 మండలాలకు చెందిన దీర్ఘకాలిక మొండి బకాయిదారులు ఓటీఎస్‌ను సద్వినియోగ పరుచుకుని కొత్తగా మళ్లీ రుణాలు పొందాలని గంప వెంకటేశ్‌గుప్తా కోరారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, సీఈవో దేవేందర్, సూపర్‌వైజర్ రాజు, సింగిల్‌విండో సిబ్బంది అల్లాజీ, పద్మకార్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూములకే రైతు భరోసా

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే

తంగడిపల్లి గ్రామంలో భూములను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తదితరులు

చేవెళ్ల రూరల్, జనవరి 17 : సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. రైతు భరోసా పథకం అమలులో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధి తంగడపల్లి గ్రామంలోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్లాట్లు, వెంచర్లుగా మారిన వ్యవసాయ భూములను గుర్తించినట్లు ఆయన చెప్పారు. పంటలు సాగయ్యే ప్రతి ఎకరాకు రైతుభరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. జనవరి 26 నుంచి రైతుభరోసా పథకం ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణయ్య, డివిజన్ వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈవో రాజేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ, సర్వేయర్లు ఉన్నారు.

ఆమనగల్లు : రైతు భరోసా పథకం కింద సాగుకు ఆమోదయోగ్యమైన భూములకు రైతు భరోసా అందజేస్తారని కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సాగుకు ఆమోదయోగ్యంగా ఉన్న భూమికి ఎకరాకు రూ. 12 వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందజేస్తున్నారు. సాగు యోగ్యత లేని భూములను గుర్తించేందుకు ఇప్పటికే ఫీల్డ్ వెరిఫికేషన్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి నాన్ అగ్రికల్చర్ భూములను గుర్తించి సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు సేకరిస్తారని, అనంతరం ఆర్‌వోఆర్, పట్టాదారు పాసుపుస్తకాలు జాబితాను పరిశీలిస్తారన్నారు. భూ భారతి పోర్టల్ నుంచి జాబితా, విలేజ్ మ్యాప్, శాటిలైట్ మ్యాప్‌ల ఆధారంగా అన్నింటినీ బేరీజు వేసుకుని వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ లలిత, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐలు చెన్నకేశవులు, సంపత్, సర్వేయర్ రవి, ఏఈవోలు పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా చేపట్టాలి

కడ్తాల్ : రైతు భరోసా పథకానికి సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, వ్యవసాయేతర భూముల వివరాలను సమగ్రంగా చేపట్టాలని కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో, రెవెన్యూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వ్యవసాయేతర భూములను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. 21వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభల్లో ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములను జాబితా రూపంలో తయారు చేయాలని సూచించారు. అర్హులైన రైతుల వివరాలను రైతు భరోసా పథకానికి పంపించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీలత, ఆర్ఐ వాహీద్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రైతు భరోసా సర్వే

మొయినాబాద్ : ప్రతి రైతుకు రైతు భరోసా ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో భూములను సర్వే చేస్తున్నామని తహసీల్దార్ గౌతంకుమార్ అన్నారు. రెండు రోజులుగా భూములకు సంబంధించిన సర్వేను తహసీల్దార్ గౌతంకుమార్ బృందం సర్వే చేస్తుండగా, శుక్రవారం ఆర్ఐ రోజా, సర్వేయర్ జలజ, వ్యవసాయ అధికారి అనురాధ, ఏఈవో సునీల్‌తో కలిసి మండల పరిధిలోని చిలుకూరు, అప్పోజిగూడ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భూముల వివరాలు, వ్యవసాయేతర భూముల వివరాలను సేకరించి నివేదికను తయారు చేస్తున్నారు. అదే విధంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య తమ బృందం సభ్యులతో కలిసి పెద్ద మంగళారం గ్రామంలో రేషన్ కార్డుల కోసం సర్వే చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే చేస్తున్నామని చెప్పారు.

మొయినాబాద్‌లోని అప్పోజిగూడలో భూముల వివరాలను సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆమనగల్లు రైతు వేదిక భవనంలో విలేజ్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

గణతంత్ర దినోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, జనవరి 17 : గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అనదపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గణతంత్ర దినోత్సవాలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపికకోసం శాఖల వారీగా ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. కలెక్టర్‌రేట్‌ను పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని రాచకొండ పోలీసు అధికారికి సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావును ఆదేశించారు. కలెక్టర్‌రేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత, జిల్లా అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నంలో ఇందిరమ్మ మాడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 17 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మాడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన ప్రతి పేదవారికి ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. మొదటి విడుత 3500ఇండ్లు నిర్మించి ప్రతి గ్రామంలో నిజమైన పేదవారికి అందజేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో 20వేల ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ చంప్లా నాయక్, డీఈ సంపత్‌కుమార్, ఏఈ రాంచంద్రయ్య, మున్సిపల్ చైర్మన్లు నిరంజన్‌రెడ్డి, స్రవంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సంస్కృతిని కాపాడాలి

కడ్తాల్: అవగాహన సదస్సులో పాల్గొన్న పర్యావరణవేత్తలతో సీజీఆర్ వ్యవస్థాకురాలు లీలమ్మ

కడ్తాల్, జనవరి 17: పర్యావరణంతోపాటు మన సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ వ్యవస్థాపకురాలు లీలమ్మ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ-సీసీఆర్టీ, డీఆర్పీ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'భూమి-సంస్కృతి' జాతీయ సదస్సు శుక్రవారం రెండోవ రోజుకు చేరుకుంది. 16 రాష్ట్రాలకు చెందిన 60 మంది డీఆర్పీలు విచ్చేసిన ఈ సదస్సులో పర్యావరణవేత్తలు, పర్యావరణ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లీలమ్మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు మానవతా విలువలు చాలా అవసరమని తెలిపారు. ప్రపంచం, దేశం శాంతియుతంగా ఉండాలంటే ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే పర్యావరణాన్ని కాపాడటంపై అవగాహన కల్పించాలన్నారు. భూమికి సంబంధించి అటవీ ప్రాంతంలో నడక, దాని విలువ, యంగ్ ఎర్త్ లీడర్స్ తదితర కార్యక్రమాలను పర్యావరణ శాస్త్రవేత్తలు సాయిభాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి నిర్వహించారు. అనంతరం తెలంగాణ సంస్కృతిలో భాగమైన పేరిణీ నృత్యాన్ని అన్నలదేవి రాజేశ్, పెరుమాండ్ల వేణుగోపాల్ చేసిన లాస్య నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నిర్వాహకులు ప్రభాకర్, రాజమల్లు, వెంకటేశ్వరరావు, నాగరాజు, సీజీఆర్ కార్యాలయ సిబ్బంది అనుదీప్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉర్సు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 17 : నియోజకవర్గ కేంద్రంలోని ఎలిమినేడు రోడ్డులోగల జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సతీమణి ముకుందమ్మ పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఎస్సైలకు ఘన సన్మానం

ఎస్సైలుగా పదోన్నతి పొందిన వారితో సీఐ ప్రమోద్‌కుమార్, చిత్రంలో ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేష్ శ్రీకాంత్

ఆమనగల్లు, జనవరి 17: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కె. యాదయ్య, బి. సీతారాంరెడ్డిలకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య, సీతారాంరెడ్డిలను ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ సమక్షంలో సీఐ ప్రమోద్‌కుమార్ అభినందించి వారికి ఎస్సై బ్యాడ్జీలను అందజేశారు.

కడ్తాల్: ఎస్ఐగా పదోన్నతి పొందిన నిరంజన్‌ను సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ

సన్మానం

కడ్తాల్ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నిరంజన్ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందాడు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో, నిరంజన్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్‌ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ తులసీరాంనాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు శ్రీను, లక్ష్మణ్, రమేశ్, సుదర్శన్, చిన్నా, బీక్యానాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడో రోజూ కొనసాగిన దీక్షలు

రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, జనవరి 17 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖలా భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి ఏడో రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖలా సర్వే నంబర్ 633 నుంచి 644 వరకు భూములను ఆక్రమించారని, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరుగకపోవడంతో దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాథోడ్, రెడ్డిరవి, చందర్, పాత్లోత్ లక్ష్మణ్, గోపాల్, నిర్మల, వసుంధర, జంగయ్య, లక్ష్మణ్, టోప్యా, సేవ్యానాయక్, సురేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు రాజు, కైలాస్, అశోక్, దశరథ్, మల్లేశ్, నర్సింహులు, రాఘవేందర్, అశోక్ పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

మంచాలలో రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

మంచాల, జనవరి 17: వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకే రైతులు పంటలను సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర రంగారెడ్డి జిల్లా అధికారి చంద్రకాంత్ అన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యవసాయంపై డ్రోన్ల యొక్క ప్రాముఖ్యత, పంటల సాగుకు ఉపయోగించే ఎరువుల యొక్క ఉపయోగాలపై రైతులను చైతన్య పరిచారు. పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువులను ఎలా ఉపయోగించాలనే విధానంపై అవగాహన కల్పించారు. అధికారుల, సలహాలు, సూచనల మేరకే పంటలు సాగు చేసుకున్నట్లయితే అధిక లాభాలు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు కృపశంకర్, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, మంచాల ఏఈవోలు లింగస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బడంగ్‌పేట,జనవరి17: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 15, 16, 24వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులు, 26వ డివిజన్‌లో ఓపెన్ జిమ్‌ను డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, ఏనుగు రాముడిలతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అధికారులు త్వరగా పనులు పూర్తి చేయించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర మహేశ్వరి జైయింద్, వంగేటి ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

జేపీ దర్గాలో దీపారాధన

కొత్తూరు, జనవరి 17: ప్రఖ్యాత జేపీ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కొత్తూరు మండల పరిధిలోని జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం మహిళలు దర్గా ప్రాంగణంలో క్యాండిల్స్ వెలిగించారు. క్యాండిల్స్ వెలుగులో దర్గా ప్రాంగణం కొత్త వెలుగులు నింపుకుంది. ఈ సందర్భంగా అక్కడి భక్తులు మాట్లాడుతూ తమ పూర్వీకులు తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి చేకూరాలని దీపారాధన కార్యక్రమాన్ని చేపడుతామని చెప్పారు. దీపాలు వెలిగించి తమ పూర్వీకుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని వివరించారు.

హామీలన్నీ కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలి

చేవెళ్లటౌన్, జనవరి 17: కాంగ్రెస్ పార్టీ నెరవేరని హామీలతో రైతులను మోసం చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, చేవెళ్ల డివిజన్ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమానికి చేవెళ్ల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు తప్పా ఏ ఒక్క పథకం అమలు చేయలేదని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, హన్మంత్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, నాయకులు శేఖర్‌రెడ్డి, విఘ్నేశ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, సత్తి పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలన

బడంగ్‌పేట, జనవరి17: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో ఆర్వో వేణుగోపాల్, బిల్ కలెక్టర్లు చేస్తున్న రేషన్ కార్డుల సర్వేను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. తప్పులు దొర్ల కుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సర్వేను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా చేయాలని సూచించారు. తప్పులు దొర్లితే అందుకు వారే బాధ్యలవుతారన్నారు హెచ్చరించారు.